క్లుప్తంగా

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో, ఏటీడబ్ల్యూవో, సచివాలయ, సంక్షేమ, సహాయకులు, గ్రామ వలంటీర్లతో ఎంపీడీవో చంద్రశేఖరరావు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి, డ్రాపౌట్ విద్యార్థుల వివరాలను అందించాలన్నారు. దీంతో ఆయా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. ఎంఈవో సీహెచ్.బాబూరావుపడాల్, ఏటీడబ్ల్యూవో తిరుపాల్ తదితరలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



టీకాలు వేస్తున్న డాక్టర్ గణేశ్వరరావు, సిబ్బంది

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలోని శనివారం ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించి, 124 పశువులకు లంపి వ్యాధి నిరోధక టీకాలను వేసినట్టు కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు తెలిపారు. వర్షాకాలం కావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నామన్నారు. గ్రామాల్లో పశువులు వ్యాధుల బారిన పడితే సమాచారం అందించాలని సూచించారు. దీంతో వైద్య సిబ్బందితో పశువులకు సకాలంలోని వైద్యసేవలు అందిస్తామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎంపీపీ శెట్టి నీలవేణికి వినతిపత్రం ఇస్తున్న పశువైద్య సంఘం సభ్యులు

అనంతగిరి: మండలంలోని పినకోట, బొర్రా పంచాయతీల్లోని పశువైద్య కేంద్రాల సమస్యలపై పశువైద్యాధికారి గణేశ్వరరావు, సిబ్బంది శనివారం వినతిపత్రం అందజేశారు. పినకోటలో శిథిలదశకు చేరిన జీసీసీ భవనంలో పశు వైద్య కేంద్రం కొనసాగుతుందని, బొర్రా పంచాయతీలో వెటర్నరీ సెంటర్ దెబ్బతిందని వినతిలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో భవనాలకు మరమ్మతు చేయాలని కోరారు. దీనిపై ఎంపీపీ శెట్టి నీలవేణి సానుకూలంగా స్పందించి, ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, భీంపోల్ ఎంపీటీసీ అశోక్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు గాయాలు



గాయపడ్డ సర్పంచ్ లక్ష్మి

చింతపల్లిరూరల్: మండలంలోని కొమ్మంగి పంచాయతీ సర్పంచ్ పాంగి లక్ష్మి ద్విచక్ర వాహనం బోల్తా సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. జిల్లా పార్టీ కమిటీ కార్యదర్శి పాంగి గణబాబు భార్య సర్పంచ్ లక్ష్మితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొలపరి వద్ద ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానిక ఏరియా ఆస్పత్రికు తరలించారు. వైద్యుల సిఫార్సు మేరకు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు

గిరిజన హక్కులు, చట్టాలపై అవగాహన నేడు

అరకులోయ రూరల్: గిరిజన ఉద్యోగుల సంఘం భవనంలో గిరిజన హక్కులు, చట్టాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి నందో తెలిపారు. కార్యక్రమానికి మానవహక్కుల నేర నిరోధక జాతీయ చైర్మన్ బి.రాకేష్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. యువత, ఉద్యోగ సంఘ నాయకులు హాజరుకావాలని కోరారు.

సాగు సందడి

- వర్షాలతో రైతుల్లో హర్షం
- పొలాల్లో సమృద్ధిగా నీరు
- వరి నాట్లు పనుల్లో నిమగ్నం



నాట్లు వేసే పనుల్లో రైతులు



రైతులకు భోజనాలు తీసుకొని వెళ్తున్న కుటుంబ సభ్యులు



పొలాల్లోకి వరి నారు తీసుకొని వెళ్తున్న రైతులు

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుతం రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. పొలాలన్నీ రైతులతో కళకళలాడుతున్నాయి. వరినాట్లు, దుక్కులు, కలుపుతీత తదితర పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది సీజన్‌కు ముందుగానే ప్రభుత్వం సాగు రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో పాటు విత్తనాలను సకాలంలోనే అందజేసింది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. నాట్లు వేసేందుకు రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూశారు. ఎట్టకేలకు గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో సాగు పనులు జోరందుకున్నాయి. పొలాల్లో సమృద్ధిగా వర్షపునీరు చేరడంతో రైతులు పనులోనిమగ్నమయ్యారు. చాలా చోట్ల నాట్లు వేసే పనులు ప్రారంభమవడంతో గ్రామాల్లో సాగు సందడి మొదలైంది.

రెండు రోజుల్లో 82 మిల్లీమీటర్ల వర్షపాతం

ఈనెల 24వ తేదీన 74.4 మీ.మీలు, 26న 7.6 మీ.మీల వర్షం కురిసింది. దీంతో గడచిన 20 రోజులుగా వర్షాలు లేక నెర్రలు తీసిన పంట భూముల్లోకి వర్షపునీరు చేరింది. వరి నారు మడుల్లోకి కూడా నీరు చేరడంతో ఇప్పటికే ఎదిగిన నారు తీసి దమ్ములు చేసిన నాట్లు వేయాల్సిన పొలాల్లోకి మోసుకొని వస్తున్నారు. ఆడవారు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో నాట్లు పూర్తవుతాయని రైతులు చెబుతున్నారు.

876 హెక్టార్లలో పూర్తయిన నాట్లు

రాజవొమ్మంగి మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 2,287.2 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 876 హెక్టార్లలో నాట్లు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు తిరిగి కురుస్తున్నాయి. ఆగస్టు నెలాఖరు నాటికి లక్ష్యం మేరకు నాట్లు వేసే పని పూర్తయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

జోరుగా ఈ–క్రాప్ నమోదు

ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, ఈ–క్రాప్ నమోదు చేపడుతున్నారు. ఈ–క్రాప్ వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంటల వివరాలు, భూమి సర్వే నెంబర్, విస్తీర్ణం తదితర వివరాలను ఈ–క్రాపు యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో వివిధ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 2.29 లక్షల ఎకరాలు కాగా ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 1.21 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సాగు సందడి మొదలైంది.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ



యార్లగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీటీసీ సుబ్బలక్ష్మి

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి శనివారం సందర్శించారు. అంగన్‌వాడీ చిన్నారులకు అందించే ఆహారపదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ సెంటర్ల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆమె చిన్నారులతో కలిసి భోజనం చేశారు. మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, గృహసారథులు జ్యోతి, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

30న వైద్య శిబిరం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని శారదా నికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో విశాఖకు చెందిన శారద ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు బుచ్చిబాబు, మత్స్యరాజు తెలిపారు. పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. విశాఖ నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వచ్చి వైద్య సేవలందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మండలవాసులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



గ్రామస్తులకు ప్రభుత్వం పథకాలపై అవగాహన కల్పిస్తున అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



డి.రామవరంలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

అరకులోయ రూరల్: ప్రజా సంక్షేమం, సుపరిపాలన అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మాడగల పంచాయతీ సచివాలయం–2 పరిధిలోని కుసుమగూడ, పేట్రుగుడ, దొరగూడ, మంజగూడ గ్రామాల్లో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 300 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించి, గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పారదర్శకంగా, పార్టీలకతీతంగా ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థతో చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మన్య ప్రాంతం అభివృద్ధి చెందుతోందన్నారు. ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, నాయకులు బాలరాజు, సాంబ, వెంకటరావు, నర్సింగ్, నగేష్, రామారావు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు

అడ్డతీగల: అన్ని వర్గాలకు మేలు చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. అడ్డతీగల మండలంలోని డి.రామవరం, ఊట్లపాలెం గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 213 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తర తరాలుగా అడవిని నమ్ముకొని కొండపోడు చేసుకునే గిరిజనులకు ఆయా భూములపై సంపూర్ణమైన హక్కులను కల్పిస్తూ హక్కు పత్రాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గ్రామాల్లోని సైతం ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించి, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి, మెరుగైన వైద్య సేవలందిస్తోందన్నారు. నాడు–నేడు కింద పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వ్యక్తిగతంగా, సామాజికంగా అన్ని వర్గాల ప్రజలు స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం చేయూత ఇస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి మరలా జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, ఎంపీటీసీ సభ్యురాలు పల్లాల విశ్వకుమారి, డి.రామవరం సర్పంచ్ చెక్కా అచ్చియ్యమ్మ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



సింగవరంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అరకులోయ మండల పార్టీ అధ్యక్షుడు గాసి



సంకాడలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్

పెదబయలు/కొయ్యూరు/గూడెం కొత్తవీధి/అరకులోయ రూరల్: జిల్లాలోని పెదబయలు, కొయ్యూరు, జీకే వీధి, అరకులోయ మండలాల్లో శనివారం జరిగిన కార్యక్రమాల్లో ఆయా ప్రాంత రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెదబయలు, కొయ్యూరు ఎంపీపీలు బొండా వరహాలమ్మ, బడుగు రమేష్‌బాబు, జీకే వీధి వైస్ ఎంపీపీ ఆనంద్, అరకులోయలో మండల పార్టీ అధ్యక్షుడు గాసి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, చట్ట వ్యతిరేక పనులు, గంజాయి సాగుకు దూరంగా ఉండాలన్నారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, జెడ్పీటీసీ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రాజుబాబు, పాంగి సోనె, ఏవో శ్రీనివాస్, జెడ్పీటీసీ వారా నూకరాజు, ఏవో ఉమాదేవి, సుంకరమెట్ట, సంకాడ సర్పంచ్‌లు చినబాబు నాగులమ్మ, నాయకులు ధనలక్ష్మి, సూరయ్య, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



కిలగాడలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలో గల కిలగాడ గ్రామంలో శనివారం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కిలగాడ పీహెచ్‌సీ నుంచి పలు వీధుల మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ మరణించిన తరువాత నేత్ర దానం చేయడంతో అంధులకు కంటిచూపుతో వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా నేత్రదానం చేయవచ్చన్నారు. మనిషి మరణాంతరం నేత్రదానం చేయడంపై ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతున్నాయని, అందరూ భాగస్వామ్యం కావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, కిలగాడ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: మండలంలోని బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ శనివారం పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బూసిపుట్టు పంచాయతీ కేంద్రానికి పక్క రహదారి కల్పించిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. సర్పంచ్‌లు రాజమ్మ, రమేష్, మాజీ సర్పంచ్ మంగన్న, నాయకులు జగబంధు, కొండలరావు, జగన్నాథం, నాగేశ్వరరావు, వార్డు సభ్యులు సూరిబాబు, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు మరువలేనివి



డుంబ్రిగుడలో విద్యార్థులకు నోట్సు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ డైరెక్టర్



అడ్డతీగలలో మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ చిట్టమ్మ తదితరులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ కిరసాని రామదాసు ఆర్థిక సాయంతో కిరసాని శ్యామ్ సుందరం సేవా సంస్థ ద్వారా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. హెచ్ఎం సునీత కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామదాసు మాట్లాడుతూ మదర్ థెరిసా చేసిన సేవలు మరువలేనివన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు అనాథులను అక్కున చేర్చుకున్న అమృతమూర్తిగా కొనియాడారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఏజెన్సీలో గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కాలేజీలకు ఏర్పాటుకు ప్రాధాన్యమిచ్చారన్నారు. విద్యార్థులు బాగా చదవుకొని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు ప్రేమావతి, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలోని మదర్ థెరిసా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాక్షి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ పప్పుల చిటమ్మ, సంస్థ డైరెక్టర్ ఆరోగ్యరాజు తదితరులు మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశంలో బడుగు, బలహీన వర్గాలకు ఆమె చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. సత్తిబాబు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి పాఠశాల భవనం



పనసపల్లిలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయుడు

గూడెంకొత్తవీధి: మండలంలోని పనసపల్లిలో ఎట్టకేలకు పాఠశాల భవనం సమకూరింది. గత కొన్నేళ్లుగా పూరిపాకలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి దృష్టికి స్థానికులు సమస్యను తీసుకువచ్చారు. దీంతో భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తికావడంతో శనివారం ప్రారంభించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులకు సన్మానం



జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సింహాచలం, సభ్యులు పుష్పలత, ధర్మయ్యదొరను సన్మానిస్తున్న నేతలు

హుకుంపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఓల్డా గ్రామానికి చెందిన పాంగి సింహాచలం, ఎగ్జిక్యూటివ్ సభ్యులైన కోట్నాపల్లికి చెందిన గెమ్మెలి పుష్పలత, రాప గ్రామానికి చెందిన శోభ ధర్మయ్యదొరను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కూడా రాజుబాబు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని కోరారు. జిల్లా పార్టీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీలో తమను గుర్తించి పదవుల ఇవ్వడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, కల్చరల్ విభాగ జిల్లా అధ్యక్షుడు దిలీప్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.కొండలరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, యువజన విభాగ ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబాబు, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొంజుబాబు, నాయకులు కాసులమ్మ, మత్స్యలింగం, చిన్నబ్బి, వెంకట్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


విద్యార్థులకు క్విజ్ పోటీలు



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిబ్బంది చలపతిరావు, పుష్పరాజు, కొండబాబు, నాగబాబు, అప్పారావు పాల్గొన్నారు.

అదృశ్యమైన చిన్నారి.. తల్లిదండ్రులకు అప్పగింత



చిన్నారి చైత్రను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అరకు ఎస్ఐ సంతోష్

అరకులోయ రూరల్: స్థానిక పోలీసు సర్కిల్ పరిధి డుంబ్రిగుడ మండలం గుంటసీమ గ్రామానికి చెందిన పాంగి సుశీల తన రెండేళ్ల చిన్నారి పాంగి చైత్ర కనిపించడం లేదని పోలీసులకు శుక్రవారం సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎస్ఐ సంతోష్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక మెయిన్‌రోడ్డుపై దుకాణ సముదాయం వద్ద ఉన్న చిన్నారిని గుర్తించారు. స్టేషన్‌కు తీసుకొచ్చి చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులతు సంతోషం వ్యక్తం చేసి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.